క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బొంరాస్‌పేట: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మండల పరిధిలోని బాపల్లితండా గ్రామపంచాయతీ పరిధిలోని సీత్యానాయక్‌తండాకు చెందిన కాత్రావత్ నందినికి రెండునెలల క్రితం ఆపరేషన్ చేశారు. కాంగ్రెస్ నాయకుల సహకారంతో కుటుంబ సభ్యులు సీఎంఆర్ఎఫ్ దరఖాస్తు చేశారు. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 50వేలు చెక్కును బుధవారం మండల యువజన కాంగ్రెస్ నాయకుడు సంతోష్ నాయక్, మహేందర్‌సింగ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గోపాల్, మోత్యానాయక్, దాస్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాగుల పంపిణీ



బ్యాగులు పంపిణీ చేస్తున్న దాతలు

పరిగి: చిట్యాల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ నారాయణరెడ్డి జ్ఞాపకార్థం కూతుళ్లు అనిత, కవిత బుధవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, రిప్రెసెమెంట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తండ్రి జ్ఞాపకార్థంగా ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తాము ఎల్లప్పుడు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు గోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు

మరమ్మతు పనుల్లో ఆర్‌అండ్‌బీ అధికారులు



కంకల్ వద్ద గుంతల్లో మట్టి పోయించి చదును చేయిస్తున్న అధికారులు

పూడూరు: వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని పలు గ్రామాల రోడ్లు దెబ్బతిన్నాయి. కంకల్, లాల్‌పహాడ్, అంగడిచిట్టంపల్లి గ్రామాలకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విషయం తెలుసుకున్న ఆర్‌అండ్‌బీ అధికారులు గుంతలమయంగా మారిన కంకల్ రోడ్డుపై మట్టి పోయించి జేసీబీతో చదును చేయించారు.

నాటుకోళ్ల పెంపకంపై అవగాహన

షాబాద్: నాటుకోళ్ల పెంపకం గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటుగా ఉంటుందని తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ హనుమంతరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముద్దెంగూడలో వెల్‌స్పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు నాటుకోళ్ల పెంపకంపై మండల పశువైద్యాధికారి స్రవంతి, వెల్‌స్పన్ సీఎస్ఆర్ హెడ్ సురేఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా రైతులు నాటుకోళ్ల పెంపకం విధానం, వాటి సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధి నివారణ చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెల్‌స్పన్ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య, సిబ్బంది శ్వేత, శ్రావణి, సుగుణమాల ఎఫ్‌పీఓ చైర్మన్ లింగం తదితరులు ఉన్నారు.

ఘనంగా ముగిసిన పవిత్రోత్సవాలు

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్‌లోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో గత ఆరు రోజులుగా నిర్వహించిన మహాకుంబ ప్రోక్షణ, పవిత్రోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. స్వామివారి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు ఆధ్వర్యంలో పవిత్రోత్సవాలు కొనసాగాయి. ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు మంగళవారం సుదర్శన నారసింహ హోమం, ద్వార బలి, మహాపూర్ణాహుతి వంటి తదితర పూజా కార్యక్రమాలతో పాటు స్వామివారి కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, టీటీడీ బోర్డు సభ్యుడు నర్సిరెడ్డి, ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



పూజలో ఎమ్మెల్యే శంకర్, టీటీడీ బోర్డు సభ్యుడు నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సింలు

ప్రైవేటుకు దీటుగా బోధన

పూర్వ ప్రాథమిక విద్య అమలుకు చర్యలు

- మూడు పాఠశాలల్లో ప్రారంభించనున్న ప్రభుత్వం
- వచ్చే ఏడాది మొదటి తరగతి ప్రారంభం
- శాఖల సమన్వయంతో నిర్వహణ



ప్రీ ప్రైమరీ కోసం ఎంపికైన దౌల్తాబాద్ బాలికల పాఠశాల

దౌల్తాబాద్: రోజురోజుకు పూర్వ ప్రాథమిక విద్యకు ప్రాధాన్యం పెరుగుతుంది. ఈ క్రమంలో గ్రామీణ ప్రాంతాల్లోనూ తల్లిదండ్రులు పిల్లలకు నాలుగేళ్లు నిండక ముందే ఎల్‌కేజీ, యూకేజీ చదివించాలన్నా ఆసక్తి కనబరుస్తున్నారు. అందుకుగాను ఎక్కువగా ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయిస్తున్నారు. ఈ పరిస్థితిని గమనించిన ప్రభుత్వం ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోనూ పూర్వ ప్రాథమిక విద్య ప్రారంభించాలని నిర్ణయించింది. ఇందుకోసం మండలంలో మూడు పాఠశాలలను ఎంపిక చేశారు.

వివిధ శాఖలతో సమన్వయం

ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు నిర్వహించేందుకు వివిధ శాఖల సమన్వయంతో మొదలు పెట్టనున్నారు. ఇందుకోసం విద్యా, మహిళా శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్య శాలకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. మండంల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మూడు శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయనున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రీ ప్రైమరీలో చేరిన విద్యార్థులకు వచ్చే ఏడాది 2026–27లో మొదటి తరగతిలో చేరేలా కనీస అభ్యాసన సామర్థ్యాలతో పాటు సంసిద్ధతా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మండలంలో అల్లాపూర్, పోల్కంపల్లి, జీపీఎస్ దౌల్తాబాద్ పాఠశాలలను ఎంపిక చేశారు.

> **అధికారుల ఆదేశాలనుసారం..**
>
> ప్రీ ప్రైమరీ బోధించేందుకు ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలనుసారం తగిన చర్యలు తీసుకుంటాం. మండలంలోని మూడు పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్య ప్రవేశపెట్టేందుకు ఆదేశాలు వచ్చాయి. దీనిపై ఉన్నతాధికారుల నుంచి పూర్తి స్థాయిలో రావల్సి ఉంది.
>
> – వెంకట్‌స్వామి, ఎంఈఓ, దౌల్తాబాద్

బీసీ–డీ నుంచి ఏ–లోకి మార్చాలి

ముదిరాజ్ సంఘం నియోజకవర్గ ప్రెసిడెంట్ శ్రీను



నిరసన వ్యక్తం చేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

కొడంగల్ రూరల్: ముదిరాజ్‌లను బీసీ–డి నుంచి ఏ–లోకి మార్చాలని ముదిరాజ్ సంఘం నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ మడిగె శ్రీను, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగతి అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ముదిరాజ్ భవన్‌లో నియోజకవర్గ ముదిరాజ్ సంఘం నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ సంబంధిత రిపోర్టును 15రోజుల్లో ప్రభుత్వానికి అందజేయాలన్నారు. అంతేకాకుండా కార్పొరేషన్‌కు వెయ్యి కోట్లు కేటాయించాలని, స్థానిక సంస్థల్లో జనాభా దామాషా ప్రకారం ప్రభుత్వం టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం భారీ ర్యాలీగా ప్రధాన రహదారి గుండా వెళ్లి అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూర వెంకటయ్య మాట్లాడారు. నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు బాలరాజ్, మండలాల అధ్యక్షుడు గుండుగారి తిరుపతయ్య, తోక ఆశప్ప, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మైపాల్, అడ్వకేట్ వెంకటయ్య, సంఘం నాయకులు అంజయ్య, బొంబాయి రాములు, శివరాజ్, ముదిగండ్ల హన్మంతు, శేఖర్, సాయిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు కూలిన బాధితులను ఆదుకోవాలి

బీజేపీ మండల అధ్యక్షుడు బొంగు మల్లేశ్



దోమ: కొత్తపల్లిలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మల్లేశ్

దోమ: వర్షాలకు ఇళ్లు కూలిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు బొంగు మల్లేశ్ డిమాండ్ చేశారు. బుధవారం దోమ మండల పరిధిలోని కొత్తపల్లిలో రాజమోని సత్యమ్మ ఇళ్లు కూలిపోయింది. ఈ సందర్భంగా ఆయన ఇళ్లను పరిశీలించి బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..మండలంలో భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో చాలా ఇళ్లు కూలిపోయాయని, అధికారులు పరిశీలించడంలేదని, బాధితులకు ధైర్యం చెప్పడం లేదని మండిపడ్డారు. తక్షణమే కూలిన ఇళ్లను గుర్తించి బాధితులను ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో మండల వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు.

నారాయణపూర్‌లో కూలిన ఇళ్లు

తాండూరు రూరల్: మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామంలో చాకలి సందమ్మకు చెందిన ఇళ్లు కూలిపోయింది. ఎడతేరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మంగళవారం రాత్రి ఈ సంఘటన జరిగిందని బాధితులు పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

విద్యార్థులకు పౌష్టికాహారం వడ్డించాలి

తహసీల్దార్ భరత్‌గౌడ్



మోడల్ స్కూల్ విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ భరత్‌గౌడ్

పూడూరు: విద్యార్థులకు పౌష్టికాహారం వడ్డించాలని తహసీల్దార్ భరత్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మోడల్‌స్కూల్‌లో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఆయన మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెను ప్రకారం మధ్యాహ్న భోజనం వండిపెట్టాలని నిర్వాహకులకు సూచించారు. బియ్యం స్టాకు వివరాలు, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు సూచించారు.

మహాధర్నాను విజయవంతం చేయండి



కేశంపేటలో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న గోవర్ధన్‌యాదవ్



నందిగామలో ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం నేతలు

పీఆర్టీయూ టీఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు రాఘవేందర్

నందిగామ: ఉపాధ్యాయులు, ఉద్యోగస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలనే డిమాండ్‌తో పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో వచ్చే నెల 1వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు రాఘవేందర్ విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రమైన నందిగామలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం మహాధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల శాఖ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి హరిఓం, ఉపాధ్యాయులు మల్లేశ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, కిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట: మండల పరిధిలోని కాకునూర్, కేశంపేట గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పీఆర్టీయూ ఆధ్వర్యంలో మహాధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఆయా గ్రామాల్లో బుధవారం పీఆర్టీయూ మాజీ జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్ పాల్గొని ఉపాధ్యాయులతో కలిసి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలనే డిమాండ్‌తో సెప్టెంబర్ 1న ఇందిరాపార్కు వద్ద నిర్వహించ తలపెట్టిన మహాధర్నాలో మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కరుణాకర్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, గోవర్ధనచారి, బాలేశ్వర్ పాల్గొన్నారు.

అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు

దుద్యాల్: హస్నాబాద్ గ్రామంలో విద్యుత్ సరఫరాకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను బుధవారం తొలగించారు. పది రోజులుగా ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తుండడంతో వైర్లకు తాకి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. తీగల వద్ద మంటలు వస్తున్నాయని గుర్తించిన లైన్‌మెన్ వెంకట్‌రాములు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను తొలిగించే పనిలో నిమజ్ఞమయ్యారు. ప్రమాదకరంగా ఉన్న కొమ్మలను తొలగించినట్లు ఆయన తెలిపారు.

సత్యాగ్రహ దీక్షకు తరలిరావాలి

బంట్వారం: బీసీ రిజర్వేషన్లను కేంద్రం అమలు చేయాలనే డిమాండ్‌తో రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య 25న ఇందిరాపార్కు వద్ద తలపెట్టనున్న సత్యాగ్రహ దీక్షకు పెద్ద ఎత్తున తరలిరావాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తెల్లి లక్ష్మణ్‌యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలలోపే 42 శాతం రిజర్వేషన్ల అమలు అంశాన్ని తేల్చాలని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిర్వహించనున్న సత్యాగ్రహ దీక్షకు రాజకీయలకు అతీతంగా మద్దతు తెలపాలని ఆయన కోరారు.

అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదు

దౌల్తాబాద్: అభివృద్ధి పనులను అడ్డుకోవడం సరికాదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రావు, జిల్లా నాయకులు వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో బీసీ హాస్టల్ వసతిగృహాన్ని కాంగ్రెస్ నాయకులు కబ్జా చేస్తున్నారని ఆరోపించడం బాధాకరమన్నారు. హాస్టల్ ప్రహరీ నిర్మాణానికి కడా నిధులు రూ.7లక్షలు మంజూరయ్యాయన్నారు. వాటితో నిర్మాణ పనులు చేపట్టామన్నారు. అవి సరిపోకపోవడంతో పనులు నిలిచిపోయాయన్నారు. కాంగ్రెస్ నాయకులకు ఎలాంటి కబ్జాలు చేయాల్సిన అవసరం లేదన్నారు. ఇక ముందు ఆరోపణలు చేస్తే సహించమన్నారు. వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు.

సబ్సిడీపై యంత్ర సామగ్రి

మొయినాబాద్: రైతులకు సబ్సిడీపై అందజేసే వ్యవసాయ యంత్ర సామగ్రి అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి అనురాధ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్ప్రేయర్లు 160, పవర్ ఆపరేటెడ్ స్ప్రేయర్లు 24, రోటవేటర్లు 8, సీడ్ కమ్ ఫెర్టిలైజర్ డ్రిల్స్ 2, కల్టివేటర్లు అండ్ డిస్కహారో 12, బండ్ ఫార్మర్ 1, పవర్ వీడర్ 1, బుష్ కట్టర్ 2, పవర్ టిల్లర్ 1, మొక్కజొన్న షెల్లర్ 1, స్ట్రాబేలర్ 1 అందు బాటులో ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, మ హి ళా రైతులకు 50 శాతం, జనరల్ రైతులకు 40 శాతం సబ్సిడీ లభిస్తుందన్నారు. ట్రాక్టర్‌తో న డిచే యంత్ర సామగ్రి పొందేందుకు రైతు లేదా రైతు భార్య పేరు మీద ట్రాక్టర్ నమోదై ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న రైతులు వ్యవసా య విస్తరణ అధికారి(ఏఈఓ), మండల వ్యవసాయాధికారిని సంప్రదించాలని సూచించారు.

గంట బహూకరణ

షాద్‌నగర్‌రూరల్: శ్రీవేంకటేశ్వస్వామి మహాకుంభ ప్రోక్షణ కార్యక్రమాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయానికి బుధవారం న్యాయవాది చెంది మహేందర్‌రెడ్డి కంచు గంటను బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులకు కంచు గంటను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సూచించారు. ఆలయాలలో గంట శబ్ధం మనలో ఆధ్యాత్మిక భావాలను, పవిత్రతను కలుగజేస్తుందన్నారు. తమ తల్లితండ్రుల జ్ఞాపకార్థం కంచు గంటను బహూకరించానని తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయవాది రమేశ్

కొడంగల్: ప్రతిఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరమని న్యాయ విజ్ఞాన వేదిక అధికారులు పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలో పాత కొడంగల్‌లోని గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడారు. పలు విషయాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మోటార్ వెహికల్ యాక్టు, బీఎన్ఎస్ (ఐపీసీ), బీఎన్ఎస్ఎస్ (సీఆర్‌పీసీ), కార్మిక చట్టాలు, బాలకార్మిక వ్యవస్థ, చదువు ప్రాముఖ్యత గురించి చెప్పారు. సమాజంలో చదువుతోనే గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రమేశ్, భాగ్యలత, వెంకటయ్య, మోహన్, మండల లీగల్ సర్వీస్ అథారిటీ సభ్యులు పాల్గొన్నారు.

దశాబ్దాలుగా సాగులో ఉన్నాం

- మాకే కేటాయించండి
- తహసీల్దారుకు నాగిరెడ్డిపల్లి రైతుల వినతి



తహసీల్దారు పద్మావతికి వినతిపత్రం అందజేస్తున్న నాగిరెడ్డిపల్లి రైతులు

బొంరాస్‌పేట: దశాబ్దాలుగా సాగులో ఉన్నామని వాటిని తమకే కేటాయించాలని కోరుతూ తహసీల్దార్ పద్మావతికి నాగిరెడ్డిపల్లి రైతులు వినతి పత్రం అందజేశారు. గ్రామశివారులోని సర్వే నంబర్లు 16, 17, 50, 56, 59లో సుమారు 15మంది 10 ఎకరాలను సాగుచేస్తున్నట్లు ఆమెకు విన్నవించారు. ఏడు దశాబ్దాలుగా తామే సాగు చేసుకుంటున్నామని వారు వివరించారు. ఈ భూమిని కబ్జాచేసి రెండేళ్లగా మధ్యవర్తుల ప్రమేయంతో హైదరాబాద్‌కు చెందిన పల్లెరాజు, యాదగిరి యాదవ్ కొనుగోలు చేస్తున్నామని, అభిప్రాయాలు తెలపాలని నోటీసులు జారీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో తమకు న్యాయం చేసి సదరు మధ్యవర్తిపై చట్టపర చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో బాబయ్య, శ్రీనివాస్, కేశవులు, రామలింగం, చంద్రయ్య, అనంతయ్య మొగులయ్య, హన్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్లో వివరాల నమోదు

ఉల్లాస్ డీఆర్‌పీ పరమేశ్



మాట్లాడుతున్న పరమేశ్

యాలాల: సేకరించిన నిరక్షరాస్యుల వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేయాలని డీఆర్‌పీ పరమేశ్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సీసీలు, వీఓఏలకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులైన వారిని అక్షరాస్యులుగా మార్చేందుకు ఉల్లాస్ తీసుకొచ్చారు. ఇందులో భాగంగా మండలంలోని గ్రామాల వారీగా ఎంతమంది నిరక్షరాస్యులు ఉన్నారో వారి వివరాలను ఐకేపీ, డ్వాక్రా సంఘాల ద్వారా సేకరిస్తున్నారన్నారు. ఆ వివరాలను ఆన్‌లైన్లో ఎలా నమోదు చేయాలో సిబ్బందికి వివరించారు. నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, సీసీలు బందె య్య, క్రిష్ణయ్య, వెంకటయ్య, నర్సింహులు తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మర్పల్లి: కోట్‌మర్పల్లి గ్రామానికి చెందిన చాకలి నర్సింలు కుటుంబానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి సాయం చేశారు. మాజీ సర్పంచ్ విజయలక్ష్మిరాచన్న, పార్టీ అధ్యక్షుడు తహసీన్ రఘుపతిరెడ్డి, జైహింద్‌రెడ్డి ద్వారా రూ. 5వేలు పంపించారు. వారు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తప్పనిసరి

- మలేరియా, ఫైలేరియా నివారణ ప్రత్యేక అధికారి ఫకీరప్ప
- మైల్వార్ మైనార్టీ గురుకుల పాఠశాలలో దోమల నివారణ మందు పిచికారీ



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న ప్రత్యేక అధికారి ఫకీరప్ప

దుద్యాల్: విద్యార్థులు తప్పనిసరిగా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మలేరియా, ఫైలేరియా ప్రత్యేక అధికారి ఫకీరప్ప పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని చిలుముల మైల్వార్ మైనార్టీ గురుకుల పాఠశాలలో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. గ్రామ పంచాయతీ కార్మికుల సహాయంతో ప్రతీ తరగతి గది, విద్యార్థులు నిద్రించే గదుల్లో, మూత్రశాలల్లో స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందునా పలు రకాల బ్యాక్టీరియా, వైరస్‌లు వ్యాప్తి చెంది దోమలు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. ప్రతీ విద్యార్థి వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. భోజనం చేసే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. ఉతికిన శుభ్రమైన దుస్తువులు వేసుకోవాలని సూచించారు. జ్వరం వస్తున్నట్లు లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది కవిత, పాఠశాల సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు కృషి



అనంతగిరి: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అనంతగిరి: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వికారాబాద్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌నాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, మాజీ కౌన్సిలర్ మురళీ, సీనియర్ నాయకుడు రెడ్యానాయక్, శ్రీనివాస్ ముదిరాజ్ పాల్గొన్నారు.

తాండూరు రూరల్‌లో..

తాండూరు రూరల్: పెద్దేముల్ మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద రాజీవ్ చిత్రపటానికి కాంగ్రెస్ శ్రేణులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ స్ఫూర్తితో తెలంగాణాలో పాలన సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ రిజాయ్, మండల అధ్యక్షుడు గోపాల్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు నసీర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌కుమార్, నాయకులు బుద్దారం వెంకటయ్య, వడ్ల ఆనంద్‌చారి, జైపాల్‌రెడ్డి, పెంటప్ప, గోపాల్, ఇబ్రహీం, విఠల్, డీవై అరవింద్, సామేల్, షబ్బీర్‌లు పాల్గొన్నారు.

మర్పల్లిలో..

మర్పల్లి: మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో జయంతి ఉత్సవాలను నిర్వహించారు. మండల అధ్యక్షుడు తుమ్మల సురేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, సీనియర్ నాయకులు రాములుయాదవ్, కలీమోద్దీన్, నాగేశ్, అశోక్‌రెడ్డి, సురేశ్, రఫి, నర్సింలు యాదవ్, వెంకట్‌రాంరెడ్డి ,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



తాండూరు రూరల్: పెద్దేముల్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



మర్పల్లి: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకుల నివాళి